80 వేల పైకి పుత్తడి

తులంపై రూ.750 పెరిగిన ధర • రూ.5 వేలు అధికమైన కిలో వెండి • దీపావళి డిమాండ్‌తో రికార్డుస్థాయికి ధరలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: బంగారం ధరలు రాకెట్‌వేగంతో దూసుకుపోతున్నాయి. దేశీయంగా పండుగ సీజన్ కావడంతో అతి విలువైన లోహాలకు డిమాండ్ నెలకొన్నది. ఫలితంగా గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న పుత్తడి సోమవారం ఏకంగా 80 వేల మైలురాయిని అధిగమించి రికార్డు సృష్టించింది. దేశ చరిత్రలో ఇంతటి గరిష్ఠ స్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం పుత్తడి ధర ఒకేరోజు రూ.750 అధికమై రూ.80,650 పలికింది. మధ్యప్రాచ్యం దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో పాటు పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా వడ్డీరేట్లను తగ్గించడంతో మదుపరుల్లో ఆందోళన తీవ్రతరమైంది. దీంతో తమ పెట్టుబడులు ఈక్విటీ మార్కెట్ల నుంచి అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు రికార్డు స్థాయిలో ఎగిశాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది.

ఆకాశానికి వెండి రేటు

గత నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చిన వెండి సోమవారం మరో ఉన్నత శిఖరాలపైన ముగిసింది. నాణేల తయారీదారులతోపాటు పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో కిలో వెండి ఏకంగా రూ.5,000 అధికమై చారిత్రక గరిష్ఠ స్థాయిని తాకింది. ఒకేరోజు ఇంతటి స్థాయిలో పెరగడం కూడా ఇదేతొలిసారి కావడం విశేషం. గత శుక్రవారం రూ.94,500గా ఉన్న కిలో ధర సోమవారానికి రూ.99,500కి చేరుకున్నది. త్వరలో లక్ష రూపాయలకు చేరుకునే అవకాశాలున్నాయని ట్రేడర్లు వెల్లడిస్తున్నారు.

తగ్గనున్న కొనుగోళ్లు

రికార్డు స్థాయికి చేరుకోవడంతో పసిడి, వెండి అమ్మకాలు పడిపోయే ప్రమాదం ఉన్నదని ట్రేడర్లు హెచ్చరిస్తున్నారు. సామాన్యుడికి ఇప్పటికే దూరమైన బంగారం, భవిష్యత్తులో ఇదే ట్రెండ్‌లో దూసుకుపోతే మాత్రం లగ్జరీ వాళ్లు కూడా వెనుకంజవేసే అవకాశం ఉన్నదన్నారు. పసిడి వినిమయంలో రెండో అతిపెద్ద దేశమైన భారత్ ప్రతియేటా 800-900 టన్నుల మేర పుత్తడిని దిగుమతి చేసుకుంటున్నది. ఈసారి బడ్జెట్‌లో పుత్తడిపై సుంకాన్ని తగ్గిస్తూ నరేంద్ర మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయంతో బంగారం ధరలు 7 శాతం వరకు తగ్గాయి. మళ్లీ ఇప్పుడు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,735.30 డాలర్లు పలకగా, వెండి 34 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.



ధరలు పెరగడానికి కారణాలు

- సప్లై-డిమాండ్‌ల మధ్య అంతరం పెరగడంతో పాటు గనుల్లో ఉత్పత్తి పడిపోవడం, లీస్టైకింగ్ రేట్లు అధికమవడం, పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ అధికంగా ఉండటం
- దేశ, విదేశాల్లో పసిడి నిల్వలు పెద్ద ఎత్తున పెంచుకుంటున్న సెంట్రల్ బ్యాంక్‌లు.
- ద్రవ్యోల్బణం పరిస్థితులూ మార్కెట్లో ధరల్ని ఎగదోస్తున్నాయి.
- పలు దేశాల కరెన్సీలు బలోపేతం కావడం, అమెరికా అధ్యక్ష ఎన్నికలు
- పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొనడం.
- చైనా వడ్డీరేట్లను పావుశాతం తగ్గించడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం.

సింగరేణి ఓసీలకు ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డులు

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఓపెన్‌కాస్ట్(ఓసీ) గనులకు కేంద్ర ప్రభుత్వం ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇస్తూ అవార్డులను ప్రకటించింది. దేశంలోని ప్రమాద రహిత గనులను కేంద్రం ఏటా పురస్కారాలకు ఎంపిక చేస్తుంది. ఈ ఏడాది రామగుండం-3లోని ఆర్జీవోసీ-1(ఎక్స్‌టెన్షన్ ఫేస్-2), ఇల్లందులోని జవహర్ ఖని ఓపెన్‌కాస్ట్‌లు ఎంపికయ్యాయి. సోమవారం రాత్రి న్యూఢిల్లీలోని స్కోప్ కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, సహాయ మంత్రి సతీశ్ చంద్రదూబే చేతుల మీదుగా సింగరేణి సీఎండీ బలరాం ఈ అవార్డులను స్వీకరించారు.

నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబై, అక్టోబర్ 21: స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం, బ్లూచిప్ సంస్థల షేర్లు నష్టాల్లోకి జారుకోవడం సూచీలపై ప్రభావం చూపాయి. ప్రారంభంలో 500 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్ చివరకు 73.48 పాయింట్ల నష్టంతో 81,151.27 వద్ద ముగిసింది. నిఫ్టీ 72.95 పాయింట్లు కోల్పోయి 24,781.10 వద్ద స్థిరపడింది. కొటక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్‌ఇండ్ అత్యధికంగా నష్టపోయాయి.

మార్కెట్‌లో కొత్త జోష్

ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్‌లో నూతనోత్సాహం

కలిసొచ్చిన పండుగ సీజన్: ఆర్బీఐ బులెటిన్

ముంబై, అక్టోబర్ 21: ప్రస్తుత పండుగ సీజన్‌లో ఊపందుకున్న కొనుగోళ్లు, పెరిగిన వ్యాపారాలతో ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్స్ పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయని ఈ నెల (అక్టోబర్)కుగాను సోమవారం విడుదల చేసిన బులెటిన్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పేర్కొన్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో మందగమనం ఏర్పడిందన్న ఆర్బీఐ.. పెరుగుతున్న డిమాండ్‌తో ఇప్పుడు అది తొలగిపోతున్నదని 'స్టేట్ ఆఫ్ ది ఎకానమీ' పేరుతో బులెటిన్‌లో ప్రచురించిన ఆర్టికల్‌లో తెలియజేసింది. ముఖ్యంగా వ్యవసాయ రంగం ఆశాజనకంగా సాగుతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి పెరిగిందని రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్లలో ఒకరైన మైఖేల్ దేబబ్రత నాయకత్వంలోని బృందం రాసిన సదరు వ్యాసం వెల్లడించింది. ఆర్బీఐ ఈ సందర్భంగా తెలియజేసింది.

బ్యాంకింగ్ రంగంపై..

వ్యక్తిగత రుణాల మంజూరులో బ్యాంకులు నిబంధనల్ని కఠినతరం చేయడంతో రిటైల్ క్రెడిట్ వృద్ధిరేటు అంతంతమాత్రంగానే ఉన్నట్టు ఆర్బీఐ చెప్పింది. అయితే రుణాల్లో పెరుగుదల లేనప్పటికీ.. డిపాజిట్ల రేట్లు అధిక స్థాయిల్లోనే ఉండొచ్చని, ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గకపోవచ్చనే అభిప్రాయాన్నే రిజర్వ్ బ్యాంక్ వర్గాలు వ్యక్తం చేశాయి. ఇక డిజిటల్ పేమెంట్లు మరింత పెరగవచ్చన్న అంచనాలున్నాయి. ఈ పండుగ సీజన్‌లో ఆన్‌లైన్ షాపింగ్ జోరుగా సాగుతుండటం, ఈ-కామర్స్ లావాదేవీలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటమే ఇందుకు కారణం. అలాగే ద్రవ్యవ్యవస్థలో ప్రస్తుతం నగదు చలామణి బాగానే ఉందని కూడా ఆర్బీఐ ఈ సందర్భంగా తెలియజేసింది.

రేట్ల పెంపుతోనే ధరలు తగ్గాయ్

వరుసగా వడ్డీరేట్లను పెంచుతూపోవడం వల్లే ధరలు తగ్గుముఖం పట్టాయని ఆర్బీఐ పేపర్ స్పష్టం చేసింది. 2022 మే నెల నుంచి రెపోరేటును పలుమార్లు 2.5 శాతం మేరకు పెంచారు. దీంతో ప్రధాన ద్రవ్యోల్బణం 1.60 శాతం మేర దిగొచ్చిందని ఆర్బీఐ సీనియర్లు రూపొందించిన పత్రం తెలియజేసింది. ఈ వరుస వడ్డింపులతోనే రెపోరేటు 6.5 శాతానికి చేరగా, టోకు-చిల్లర ద్రవ్యోల్బణాలు ఎంతకీ దిగిరాకపోవడంతో నిరుడు ఏప్రిల్ నుంచి రేట్లు అక్కడే ఉన్నాయి. సుదీర్ఘకాలం తర్వాత ఇటీవలి ద్రవ్యసమీక్షలోనే కఠిన వైఖరిని వీడుతున్నట్టు సెంట్రల్ బ్యాంక్ ప్రకటించింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్ల తగ్గింపునకు మార్గం సుగమమైంది.

పర్సిస్టెంట్‌కు 30 లక్షల సీడ్ ఫండ్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): సరికొత్త ఆలోచనలతో ఏర్పాటవుతున్న స్టార్టప్‌లకు పెట్టుబడిదారులు ఆర్థికంగా మద్దతునిస్తున్నారు. తాజాగా టీ హబ్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న పర్సిస్టెంట్ స్టార్టప్‌కు ప్రారంభ దశ పెట్టుబడి కింద రూ.30 లక్షల నిధులు సమకూరాయి. పారిశ్రామిక రంగంలో ఆటోమేషన్ ప్రక్రియను విరివిగా వినియోగించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)టెక్నాలజీని వినియోగించేలా వినూత్న అప్లికేషన్స్‌లు రూపొందిస్తున్న పర్సిస్టెంట్ స్టార్టప్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఎంజీయా పార్టనర్స్, యాలి క్యాపిటల్, వైట్ బోర్డు క్యాపిటల్ వంటి ఏంజిల్ ఇన్వెస్టర్లు ఈ నిధులను సమకూర్చారు.

పల్సర్ ఎన్ 125 బైకు

ప్రారంభ ధర రూ.94,707

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: స్పోర్ట్స్ బైకు ప్రియులను ఆకట్టుకోవడానికి బజాజ్ ఆటో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే అత్యంత ప్రజాదరణ పొందిన పల్సర్ విభాగంలోనే సరికొత్తగా ఎన్ 125 మాడల్‌ను పరిచయం చేసింది. ఏడు రంగుల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.94,707గా నిర్ణయించింది. బ్లూటూత్, ఐఎస్‌జీ కలిగిన మాడల్ ధర రూ.98,707, టాపెండ్ మాడల్ రూ.1.06 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు డిల్లీ షోరూంనకు సంబంధించినవి. 125 సీసీ సామర్థ్యంతో రూపొందించిన ఈ బైకు గంటకు 97 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. కేవలం ఆరు సెకండ్లలోనే 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ బైకును యువతను నచ్చే విధంగా టెక్నాలజీ పరంగా మార్పులు చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. టీవీఎస్ రైడర్ 125, ఎక్స్‌ట్రీమ్ 125ఆర్, హోండా ఎస్‌పీ 125 మాడళ్లకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను ప్రవేశపెట్టింది.

ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభలో నివాళి అర్పిస్తున్న హరగోపాల్ తదితరులు

హక్కుల కోసమే సాయిబాబా పోరాటం

- కాళ్లు లేకున్నా సమాజానికి నడక నేర్పాడు: హరగోపాల్
- ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభలో వక్తల నివాళి

చిక్కడపల్లి, అక్టోబర్ 21: ఆదివాసీ, దళితులు, మైనార్టీలు, వివిధ వర్గాల ప్రజల హక్కుల కోసం, ఆదివాసీ ప్రాంతాల్లోని సుసంపన్నమైన ఖనిజ సంపదను పరిరక్షించడం కోసం ప్రొఫెసర్ సాయిబాబా జీవితాంతం పోరాడారని పలువురు వక్తలు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. సాయిబాబాకు కాళ్లు లేకున్నా సమాజానికి నడక నేర్పాడని అన్నారు. ఆయన జీవితాంతం ప్రజాస్వామిక పోరాటాలు చేశారని వివరించారు. బీజేపీ పాలనలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలు నిర్వర్యం అయ్యాయని విమర్శించారు. ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. సాయిబాబా ఉద్యమాల తీరు తెన్నులకు ఆదర్శం అని అన్నారు. ఈ దేశంలో నిజమైన నేరస్థులు తాము దోచుకున్న సంపదతో విదేశాల్లో విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్నారని, ఏ నేరం చేయని సాయిబాబాను మాత్రం శిక్షించారని మండిపడ్డారు. రాజ్యం సాయిబాబా పట్ల క్రూరంగా వ్యవహరించడం అన్యాయమని పేర్కొన్నారు. సభలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మనేని వీరభద్రం, రచయిత మీనా కందస్వామి, సీనియర్ సంపాదకుడు కే శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ తదితరులు ప్రసంగించారు.

స్పెక్ట్రా ఆఫీస్ ముట్టడి

- ప్లాట్ల డబ్బులు తిరిగివ్వాల్సిందే..
- కార్యాలయం ఎదుట ఆందోళన

ఎల్బీనగర్, అక్టోబర్ 21: డబ్బులు చెల్లించిన తర్వాత ప్లాట్లు కేటాయించకుండా, తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్న స్పెక్ట్రా సంస్థ కార్యాలయాన్ని బాధితులు సోమవారం ముట్టడించారు. రోడ్డుపై బైఠాయించి స్పెక్ట్రా యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎల్బీనగర్‌లోని స్పెక్ట్రా సంస్థ యాదగిరిగుట్ట, చౌటుప్పల్, షాద్‌నగర్ ప్రాంతాల్లో ప్లాట్లు ఇస్తామని డబ్బులు కట్టించుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా వేధిస్తున్నదని ఆరోపించారు. గట్టిగా నిలదీస్తే డబ్బులు ఇస్తామంటూ చెక్కులు ఇచ్చారని, ఆ చెక్కులు బౌన్స్ అవుతున్నాయని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను సముదాయించినా న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు.

మీ వ్యాపారాలను బహిష్కరించాలా?

- చంద్రబాబు ఒక కన్ను (తెలంగాణ)ను తీసేశారా?
- తిరుమలలో జడ్చర్ల ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు
- తెలంగాణ సిఫారసు లేఖల రద్దుపై మండిపడ్డ అనిరుధ్, ఎమ్మెల్సీ బల్మూరి

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): తెలంగాణ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేయడంపై ఏపీ సీఎం చంద్రబాబు, ప్రజాప్రతినిధులపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మండిపడ్డారు. 'ఏపీ నేతలు మా దగ్గరికి వచ్చి వ్యాపారాలు చేసుకుంటే మేము ఒక్క మాట అనలేదు. మీరు తెలంగాణకు రావొద్దని, అసెంబ్లీలో బాయ్‌కాట్ అనే నిర్ణయం తీసుకుంటే మీరే బాధపడతారు.' అంటూ హెచ్చరించారు. ఏపీ సీఎం చంద్రబాబును ఒక్కటే అడుగుతున్నాం.. మీరు విభజన సమయంలో ఒక కన్ను తెలంగాణ .. ఒక కన్ను ఆంధ్రా అని చెప్పారు. మరి ఈ రోజు ఒక కన్ను (తెలంగాణ)ను తీసేశారా? మీ ఎమ్మెల్యేలు, నేతలు యాదాద్రి, భద్రాచలం వచ్చి ఈవోలకు ఫోన్లు చేస్తే గౌరవమర్యాదలిస్తున్నారు. ఇక్కడ మాత్రం మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు.' అని మండిపడ్డారు. సోమవారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టీటీడీలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో వచ్చే భక్తులకు దర్శనాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈవో శ్యామలరావు ఏపీ సిఫారసు లేఖలు మాత్రమే అనుమతిస్తామని చెప్పారన్నారు.

చేప పిల్లల సంఖ్య తగ్గిస్తే ఎలా?

నిరుడు ఇచ్చిన చేప పిల్లల సంఖ్యలో సగం మాత్రమే సరఫరా చేస్తామనడం సమంజసం కాదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలా చేప పిల్లలను తగ్గించి సరఫరా చేస్తే.. చేపలతో ఉపాధి పొందే ముదిరాజ్ సామాజిక వర్గానికి నష్టం కలుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డికి ఓ లేఖ రాశారు. నిరుడు చెరువులకు సరఫరా చేసిన చేప పిల్లల సంఖ్యలో సగం మాత్రమే ఈ ఏడాది సరఫరా చేస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని, ఈ విషయమై అధికారులను ప్రశ్నించగా.. నిరుడు కంటే ఈ ఏడాది సగం సరఫరా చేయాలని రాష్ట్ర ఫిషరీస్ డైరెక్టర్ ఆంక్షలు విధించారని చెప్పారన్నారు. దీంతో నిరుడు లక్ష చేప పిల్లలు సరఫరా చేసిన చెరువులకు ఈ ఏడాది 50 వేలు మాత్రమే సరఫరా కానున్నాయని తెలిపారు. తన నియోజకవర్గంలోని చెరువులు, కుంటల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. వర్షాలు బాగా కురుస్తున్నా.. వానలు రావడం లేదని సాకుగా చూపించి ఫిషరీస్ డైరెక్టర్ చేపపిల్లల సంఖ్యను తగ్గించడం సమంజసం కాదని లేఖలో వివరించారు. ఫలితంగా ఈసారి చేపల సంఖ్య సగానికి తగ్గి.. వాటిపై ఆధారపడిన కుటుంబాల ఆదాయానికి గండిపడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే సీఎం చొరవ తీసుకొని నిరుడు ఇచ్చిన విధంగానే ఈసారి కూడా చేపపిల్లలు సరఫరా చేయాలని లేఖలో కోరినట్టు ఎమ్మెల్యే చెప్పారు.

పాలిటెక్నిక్‌లో ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 21: టీజీ ఎప్‌సెట్-2024 ఇంటర్మీడియట్(బైపీసీ) పూర్తయిన విద్యార్థులు బీఫార్మసీ, ఫార్మాడీ, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ అండ్ బయోటెక్నాలజీ కోర్సులకు మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం హనుమకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రారంభమైంది. సమస్యల నివృత్తి కోసం హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పది మంది జీహెచ్‌ఎంల సస్పెన్షన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 21: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా స్పౌజ్, ఇతర క్యాటగిరీల్లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగానికి పాల్పడ్డారని మహబూబ్‌నగర్ జిల్లాలో 10 మంది జీహెచ్‌ఎంలను పాఠశాల విద్యాశాఖ సస్పెండ్ చేసింది.

పాఠశాలలో ఫుడ్ పాయిజన్

బిజినేపల్లి, అక్టోబర్ 21: పాఠశాలలో వడ్డించిన భోజనం విషతుల్యం కావడంతో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం విద్యార్థులకు భోజనం వడ్డించారు. 15 మంది భోజనం చేయగా.. కొద్దిసేపటికే ఫుడ్ పాయిజన్ అయ్యి అఖిల్, లోకేశ్, శ్రీతేజ, లావణ్య, ప్రవల్లికతోపాటు మరో ఇద్దరు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. స్థానికులు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

బెటాలియన్ ఉద్యోగుల కుటుంబాల రాస్తారోకో

నీలగిరి, అక్టోబర్ 21 : పోలీస్ బెటాలియన్ విభాగంలో ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న రికార్డుల పద్ధతిని ఉపసంహరించుకోవాలని సోమవారం అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై నల్లగొండ జిల్లా అన్నెపర్తి 12వ బెటాలియన్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ బెటాలియన్‌లో కింది స్థాయి ఉద్యోగులను డ్యూటీ విషయంలో పైఅధికారులు తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు.

బాలసదనంలో బాలికపై లైంగిక వేధింపులు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 21: బాలికపై లైంగిక వేధింపుల కేసులో ఒకరిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగింది. వలిగొండ పరిధిలోని శాంతి నిలయంలో చదువుతున్న బాలిక దసరా సెలవుల్లో భువనగిరి బాలసదన్‌కు 1న వచ్చింది.14న బాలసదన్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించగా డీసీపీవోతోపాటు మరికొంత మంది హాజరయ్యారు. ఆ సమయంలో ఓ బాలిక బాత్‌రూమ్‌కు వెళ్లి గదిలోకి వస్తుండగా అటెండర్ వెంకట్‌రెడ్డి లైంగికంగా వేధించగా ఏడ్చుకుంటూ గదిలోకి వెళ్లింది. గమనించిన బాల సదన్ సిబ్బంది ఆరా తీయగా తనపై గాయాలను చూపించింది. సోమవారం జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ జైపాల్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిలర్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ నర్సింహారావు విచారణ జరుపగా వెంకట్‌రెడ్డి బాలికను గాయపరిచినట్టు తేలింది. భువనగిరికి చెందిన వెంకట్‌రెడ్డిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ తెలిపారు. మరోవైపు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన సిరిసిల్ల పట్టణం గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నరేందర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం తెలిపారు.



బ్యాక్‌లాగ్ తొలగించి తమకు న్యాయం చేయాలని గాంధీభవన్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న ఉర్దూ మీడియం డీఎస్సీ అభ్యర్థులు

బ్యాక్‌లాగ్ పోస్టులను జనరల్ క్యాటగిరీకి మార్చాలి

డీఎస్సీ ఉర్దూ మీడియం అభ్యర్థుల డిమాండ్

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 21 : బ్యాక్‌లాగ్ పోస్టులను జనరల్ క్యాటగిరీలోకి మార్చి తమకు న్యాయం చేయాలని డీఎస్సీ ఉర్దూ మీడియం అభ్యర్థులు డిమాండ్ చేశారు. సోమవారం గాంధీభవన్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. డీఎస్సీ-2024 1,183 ఉర్దూ మీడియం పోస్టులు ఉన్నాయని, కానీ సీఎం ఇచ్చిన అపాయింట్‌మెంట్లలో 550 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. మిగతా పోస్టులు బ్యాక్‌లాగ్ అయ్యే అవకాశం ఉందని, దీంతో తమకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిసారించి బ్యాక్‌లాగ్ పోస్టులను జనరల్ క్యాటగిరీలోకి మార్చి తమకు న్యాయం చేయాలని కోరారు.

బీఎస్సీ ఆనర్స్ ప్రత్యేక ఫీజు తగ్గింపు

- రూ.10 లక్షల నుంచి 5 లక్షలకు తగ్గించిన వర్సిటీ

హైదరాబాద్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ)/వ్యవసాయ యూనివర్సిటీ : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కోటా కింద బీఎస్సీ(ఆనర్స్)లో అదనంగా 200 సీట్లను పెంచుతున్నట్టు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రకటించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలుచేయనున్నట్లు తెలిపారు. దీంతోపాటు ప్రత్యేక కోటా బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ కోర్సు నాలుగేండ్ల ఫీజును రూ.10 లక్షల నుంచి 5 లక్షలకు తగ్గించినట్టు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

మరిన్ని వార్తలు
ntnews.com లో చూడగలరు

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఓపెన్ ఇ-టెండర్ నోటీస్ నెం.లు C/E.29/Elec/M/SC/19 & 20/OEW/OT/2024-25 Dt.18.10.2024 PUB/1061

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారు భారత రాష్ట్రపతి తరపున 11.11.2024 న 15.00 గం.వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం.1. ఇ-టెండర్ నెం. **C/E.29/Elec/ M/SC/19/OEW/OT/2024-25,** ఇ టెండర్ నెం. E-M-SC-19-OT-2024-25, **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్: KZJ-SC-WD సెక్షన్, VKB-PRLI సెక్షన్ మరియు PDPL-NZB సెక్షన్‌లో స్టేషన్ బిల్డింగ్స్/ కవర్ ఓవర్ ప్లాట్‌ఫామ్స్, సర్వీస్ బిల్డింగ్స్, రెసిడెన్సియల్ బిల్డింగ్స్ మరియు ఎలీసీ గేట్స్ వద్ద వివిధ సామర్థ్యాల 1 MWp రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్స్ (0.75 MWp SPV మోడ్ మరియు 0.25 MWp BIPV మోడ్ కలిగినవి) ఏర్పాటుచేయుట- విద్యుత్ ఏర్పాట్లు, **టెండర్ విలువ:** రూ. 8,47,97,916.25/-, **బయానా:** రూ. 5,74,000.00, CTF: రూ.0.00/- **పూర్తి చేయు కాలం:** 6 నెలలు.

క్ర.సం.2. ఇ-టెండర్ నెం.**C/E.29/Elec/M/SC/20 /OEW/OT/2024-25,** ఇ టెండర్ నెం.E-M-SC-20-OT-2024-25, **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్- ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్: KZJ-BP